# సమస్యలపై నిలదీత!

- అజెండా పంపకుంటే ఎలాగని ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- వాడివేడిగా సాగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం



అజెండాపై అడిగిన ప్రశ్నకు బదులిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, వేదికపై ఛైర్‌పర్సన్ శారద, ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, అన్నమయ్య డీఆర్వో సత్యనారాయణ

–న్యూస్‌టుడే, కడప ఎడ్యురోడ్లు

మంత్రి, ఉన్నతాధికారులు లేకుండా సమావేశమెందుకు, అజెండా పంపకుంటే అంశాలపై ఎలా చర్చించాలి, ఎరువుల అధిక ధరలకు విక్రయం, జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంపై చర్చలేదా.... ఇలా పలు అంశాలపై జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు గళమెత్తారు. కడపలో బుధవారం జడ్పీ ఛైర్మన్ శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, అన్నమయ్య డీఆర్వో సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ బాలయ్య, డిప్యూటీ సీఈవో మైథిలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు, వ్యాపారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని, అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖాధికారి బదులిచ్చారు. ఉమ్మడి కడప జిల్లాలో కరవు మండలాలుగా ప్రకటించేందుకు ఎన్నింటికి ఆస్కారం ఉందని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాల ధర కంటే బయట మార్కెట్లో తక్కువగా ఉందని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ధరలు తగ్గించాలని కోరారు. ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ మండలంలో అధిక పంటలు నష్టం జరిగిందని, రైతులను ఆదుకోవాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాంబపురంలో చేనేత కార్మికులు ఒక్కరూ కూడా లేకున్నప్పటికీ 50 మంది పింఛన్లు తీసుకుంటున్నారని, వీరిని జాబితా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి డిమాండు చేశారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాలన్నారు. ప్రతి సమావేశంలో తాము ప్రశ్నలను అడగడం, అధికారులు చేస్తామని చెప్పడంతోనే సరిపోతోందని, చర్యలపై నివేదిక ఇవ్వకపోతే ఎలాగని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జడ్పీ అధికారులను నిలదీశారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండలంలో వరద ప్రవాహానికి అడ్డంగా సిమెంటు పరిశ్రమను నిర్మించారని, దీంతో పంటలు ముంపునకు గురవుతున్నాయని, దీనిపై కలెక్టరు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నమయ్య జలాశయం నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని రామాపురం జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ తీర్మానం ప్రతిపాదించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు శివప్రసాద్‌రెడ్డి, సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, ముత్యాల ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రవికుమార్‌రెడ్డి, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అజెండా ఇప్పుడు ఇస్తారా?

'జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు చెప్పి, గంట ఆలస్యంగా ప్రారంభించారు. అజెండా కూడా పంపడం లేదు. తాను వచ్చాక ఇచ్చారు. ఇది సరైన పద్ధతేనా' అంటూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమావేశం ప్రారంభంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కలుగజేసుకుని అజెండా ఆలస్యంగా ఇస్తే తాము ఎలా సన్నద్ధం కావాలని ప్రశ్నించారు. అసలు మంత్రులు అందుబాటులో లేరు. రెగ్యులర్ కలెక్టరు లేరు. జడ్పీ సీఈవో లేరు.. సమావేశాన్ని వాయిదా వేస్తే మేలని పేర్కొన్నారు. దీనిపై జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి స్పందిస్తూ గత సమావేశం నిర్వహించి 90 రోజులైన నేపథ్యంలో ప్రస్తుతం తప్పనిసరి అని చెప్పడంతో ప్రారంభించారు. ఇకపై అజెండాతో పాటు ప్రగతి నివేదిక పుస్తకాలను ముందుగానే పంపిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

### ఎంఎస్‌ఎంఈ సెంటర్ ఏర్పాటుకు కృషి

ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి నుంచి తరలించడం సరికాదని చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేష్ రామాంజులరెడ్డి పేర్కొన్నారు, సంబంధిత అధికారి మాట్లాడుతూ తొలుత ఆ సెంటర్ గుంటూరు జిల్లాకు మంజూరైందన్నారు. అక్కడ స్థల సమస్యతో కడపలోని కొప్పర్తికి తీసుకొచ్చారని, సీఆర్‌డీఏ ఏర్పడిన తర్వాత స్థలం లభించడంతో అక్కడికి తరలించారని తెలిపారు. 2021లో గుంటూరు, కొప్పర్తిల్లో రెండు సెంటర్లు ఉండేవిధంగా ప్రతిపాదనలు చేయగా, కేంద్రం నుంచి ఒకదానికే ఆమోదం వచ్చిందని వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి ఈ సెంటర్‌ను కడపకు తీసుకొచ్చేవిధంగా ప్రయత్నిద్దామన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

# ఆనంద ప్రయాణం... అంతలోనే విషాదం!

- వివాహ రిసెప్షన్‌కు వెళ్తూ ముగ్గురి మృతి
- కారును ఢీకొట్టిన ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు
- ప్రమాదంలో మరో నలుగురికి గాయాలు

పెళ్లి జరిగి రెండు రోజులు గడిచింది. ఆనందం నిండిన ఆ ఇంట విషాదం ఆవహించింది. మేళతాళాలు మోగిన ముంగిట ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. కుమార్తె అత్తవారింట వేడుకకు సంతోషంగా మొదలైన ప్రయాణం అర్ధాంతరంగా ముగిసింది. రహదారి ప్రమాదం మూడు ప్రాణాలను చిదిమేసింది. రెండు కుటుంబాలను కన్నీటిపాల్జేసింది. మరణంలోనూ ఆ దంపతుల బంధం వీడలేదు. కలిసి జీవించిన వారు కలిసే కన్నుమూశారు. ఆనంద వేడుక విషాదంగా మారింది. రైల్వేకోడూరు సమీపంలోని బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు.

- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు గ్రామీణ, కర్నూలు నేరవార్తలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



వాసవి, ప్రేమ్‌కుమార్ దంపతులు, సుచిత్ర (పాత చిత్రాలు)

కర్నూలు నగరంలోని సరాఫ్ బజారుకు చెందిన బంగారం వ్యాపారి, ఐడీలాండ్ లాడ్జి యజమాని కామిశెట్టి గురువయ్య ఇంట వివాహం నెలకొంది. అర్తవ్యాపారవేత్తలందరికీ సుపరిచితులైన గురువయ్యకు ముగ్గురు కుమారులు రాజేష్, మహేష్, జగదీష్ ఉన్నారు. రాజేష్ కుమార్తె సిరిచందన (న్యాయవాది)కు తిరుపతికి చెందిన రోహిత్‌తో ఈ నెల 20న కర్నూలులో వివాహం జరిగింది. ఈ నెల 24న తేదీన తిరుపతిలో రిసెప్షన్ నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వాహనాల్లో బుధవారం కర్నూలు నుంచి తిరుపతికి బయల్దేరారు. రైల్వేకోడూరు వద్ద మైసూరువారిపల్లె సమీపంలో తిరుపతి నుంచి కడప వైపు ఎదురుగా వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో నవవధువుకు పిన్ని వరస అయిన సుచిత్ర(49), వారి బంధువులు కళాక్షేత్ర సిల్క్‌హౌస్ యజమాని ప్రేమ్‌కుమార్ (55), ఆయన భార్య వాసవి(45) మృతిచెందారు. ప్రమాదంలో గాయపడిన మహేష్, లలితమ్మ, ఉమేంద్ర, రాజేశ్వరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హేమసుందరరావు తెలిపారు.

# మాకేదీ న్యాయం?

- వైకాపా పాలనలో అన్నదమ్ముల హత్య
- ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు
- తెదేపా నేతల ఎదుట బాధితుల ఆవేదన

**ఈనాడు, కడప :** గత వైకాపా ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల ప్రస్తావన మరోసారి బద్వేలులో బుధవారం తెరపైకి వచ్చింది. కనీసం తమను ఓదార్చిన వారు సైతం లేకపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని, మీరైనా ఆదుకోవాలంటూ తెదేపా నేతలను బాధితులు వేడుకున్నారు. బద్వేలులో గత జనవరిలో జంట హత్యలు జరిగాయి. పసుపులేటి ప్రశాంత్, సాయి కుమార్‌లను తల్లిదండ్రుల కళ్ల ముందే నిర్దాక్షిణ్యంగా చంపేశారు. తమకు ఎవరూ దిక్కులేరని, తమను సైతం నిందితులు విజయభాస్కర్ బెదిరిస్తున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌రెడ్డి ఎదుట బాధితులు విలపించారు. చేతులెత్తి నమస్కరిస్తూ న్యాయం కోసం వేడుకున్నారు. బద్వేలు హత్యకు గురైన ఇంటర్మీడియట్ విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించి వెలుపలికి వస్తున్న నేతల వద్దకు బాధితులు వచ్చి వినతిపత్రం ఇవ్వడంతో పాటు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, ఇప్పుడు ఏదైనా ఘటన జరిగితే వెంటనే స్పందించడం, నిందితులను పట్టుకోవడం, బాధితులకు బాసటగా నిలుస్తున్నట్లు తెదేపా నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు గతంలో స్పందన లేకుండా పోయిందంటూ బాధితులు వాపోయారు. వైకాపా ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల లోపం కారణంగా నష్టపోయిన బాధితులు ఇప్పుడు వచ్చి గోడు వెళ్లబోసుకోవడం చర్చనీయాంశమైంది.



తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, బద్వేలు సమన్వయకర్త రితీష్‌రెడ్డి ఎదుట విలపిస్తున్న బాధితులు వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి దంపతులు(వృత్తంలో ఉన్న వ్యక్తులు)

# అతివలకు తీపి కబురు!

- ఏడాదికి మూడు గ్యాస్‌సిలిండర్ల ఉచితం
- ఈ నెల 31 నుంచి అమలుకు శ్రీకారం
- లబ్ధిదారుల జాబితా తయారీలో నిమగ్నం

–ఈనాడు, కడప




ఎన్డీయే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి పండగ రోజు నుంచి పేద మహిళలకు ఏడాదికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. ప్రతి నాలుగు నెలలకొక సిలిండరు వంతున ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుంది. నగదు చెల్లించి కొనుగోలు చేసిన 48 గంటల్లో తిరిగి ఖాతాలో నగదు జమయ్యేవిధంగా చూడాలని నిర్ణయించింది. పండగ వేళకు ముందే రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పిందంటూ మహిళలు సంబర పడుతున్నారు.

- ఎన్నికల హామీల్లో భాగంగా 'సూపర్ సిక్స్'లో 'మహాశక్తి' పథకం ఒకటి. పథకం కింద పేద మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చింది. రానున్న దీపావళి నుంచి పథకం అమలుకు విస్తృతంగా సన్నాహాలు జరుగుతున్నాయి. పథకం కింద అర్హత ఉన్నవారందరికీ మూడు సిలిండర్లపై నగదును డీబీటీ విధానం కింద లబ్ధిదారులు పొందనున్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో నగదు మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. సిలిండర్‌కు సంబంధించి కేంద్రం ఇచ్చే రాయితీ పోను మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల వ్యవధిలో జమ చేస్తుంది.
- జిల్లాలో వివిధ కేటగిరీల కింద 6,87,336 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సింగిల్ సిలిండర్లు 3,13,833, డబుల్ సిలిండర్లు 1,60,600, దీపం కింద 2,04,500, ఉజ్వల పథకం కింద 3,063, సీఎస్‌ఆర్ 5,340 ఉన్నాయి. పథకాన్ని ఈ నెల 31 నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టి.. మరింత సరళతరం చేస్తూ తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు సంబర పడుతున్న తరుణంలో దీపావళి ధమాకాగా ఉచిత సిలిండర్ల పథకం అమలు చేయడంపై పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- జిల్లాలో రేషన్‌కార్డులు 5,49,744 వరకు ఉండగా.. అంత్యోదయ అన్నయోజన కార్డులు 36,608 వరకు ఉన్నాయి. పేదలను గుర్తించడానికి సిలిండర్లతో రేషన్‌కార్డులు ముడిపెట్టే అవకాశాలున్నాయి. సిలిండర్లు పంపిణీకి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చమురు కంపెనీలు గ్యాస్ ఏజెన్సీలను నిర్వహిస్తున్నాయి. ఉజ్వల పథకం కింద లబ్ధిదారులకు మాత్రం ప్రతి సిలిండర్‌పై కేంద్రం రూ.300 రాయితీ ఇస్తోంది. మహాశక్తి పథకం కింద లబ్ధిదారుల సంఖ్యపై పౌర సరఫరాల సంస్థ నుంచి స్పష్టత రాలేదు. కసరత్తు ముమ్మరం చేయాలనే ఆదేశాలు ఉన్నత స్థాయి నుంచి వచ్చాయి. ఒకట్రెండు రోజుల్లో జిల్లా స్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

## వీసీని తొలగించే వరకు
# పోరాటం ఆగదు

వైవీయూను ముట్టడించిన విద్యార్థులు

**వైవీయూ (కడప), న్యూస్‌టుడే:** లైంగిక వేధింపులకు పాల్పడిన యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ కె.కృష్ణారెడ్డి పదవి నుంచి దిగే పోయే వరకు తమ పోరాటం ఆగదని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు గంగా సురేష్, వలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు వైవీయూ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శివశంకర్, తేజ, చంద్ర పాల్గొన్నారు.



విద్యార్థులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

# లోయలో పడ్డ ఆర్టీసీ బస్సు

- 20 మంది ప్రయాణికులకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ప్రమాదం
- పులివెందుల పట్టణ సమీపంలో చోటుచేసుకున్న ఘటన



పులివెందుల సమీపంలో లోయలో పడిన ఆర్టీసీ అద్దె బస్సు



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తూ...

**పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే :** పులివెందుల పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరికి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు. . పులివెందుల ఆర్టీసీ డిపో అద్దె బస్సు బుధవారం ఉదయం కదిరి నుంచి పులివెందులకు వస్తోంది. పట్టణ సమీపంలో డంపింగ్ యార్డు వద్దకు రాగా, ఎదురుగా రెండు లారీలు ఒకదాన్నొకటి దాటుకునే ప్రయత్నంలో చిన్న లారీ డ్రైవరు అకస్మాత్తుగా బస్సుకు అడ్డొచ్చారు. ఊహించని పరిణామంతో ఆర్టీసీ డ్రైవరు గంగిరెడ్డి బస్సును అదుపు చేసేందుకు ఎడమవైపు తిప్పగా పక్కనే 40 అడుగుల లోయలో పడి పోయింది. బస్సులో 21 మంది వరకు ప్రయాణికులుండగా, అంతా పులివెందుల, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినవారే. ఘటనలో పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన షేక్ సాబీరున్నీసా, కదిరికి చెందిన దాదాపీర్, గాండ్లపెంట మండలం నర్సన్నగారిపల్లెకు చెందిన కదిరి నర్సింహులు, పులివెందులకు సిరిగిరెడ్డి థామస్‌రెడ్డి, తొండూరు మండలం కృష్ణంగారిపల్లెకు చెందిన గూడూరు రామసుబ్బారెడ్డి, కదిరి మండలం మెటుకుపల్లెకు చెందిన శ్రీదేవి, బస్సు కండక్టర్ నీరజామణితోపాటు మరో 13 మందికి గాయాలయ్యాయి. వీరిని '108' వాహనంలో పులివెందుల ఆసుపత్రికి తరలించారు. థామస్‌రెడ్డి పక్కటెముకలు విరగడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పులివెందుల ట్రాఫిక్, అర్బన్ సీఐలు హాజీ వల్లీ, గంగనాధ్‌బాబు పరిశీలించారు. గాయపడినవారిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, తెదేపా సింహాద్రి పురం మండల బాధ్యుడు జోగిరెడ్డి, పులివెందుల పురపాలక సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, తదితరులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో బస్సు పల్టీలు కొడుతూ వెళ్లి నేలను తాకే సమయంలో యథాస్థితికి చేరడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, బోల్తా పడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హాజీవల్లీ తెలిపారు.

## శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

**చిన్నచౌకు (కడప) :** కార్తికమాసం సందర్భంగా నవంబరులో 4, 11, 18, 25 తేదీల్లో (సోమవారాలు) శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ప్రాంతీయ అధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం, మహానంది, అరుణాచలం తదితర ప్రాంతాలకు బస్సులు వెళ్తాయన్నారు. నవంబరు 15న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని చెప్పారు. అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## రాయితీ నూలుకు దరఖాస్తుల ఆహ్వానం

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** చేనేత కార్మికులకు కేంద్రప్రభుత్వం రాయితీపై నూలు సరఫరా చేస్తోందని చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారి పిచ్చేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత చేనేత కార్మికులు, చేనేత స్వయంసహాయక సమూహాలు, సహకార సంఘాల సభ్యులు, జాయింట్ లయబిలిటి గ్రూపులు, హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీలు, మాస్టర్ వీవర్లు తదితరులకు కేంద్రప్రభుత్వం 15 శాతం రాయితీతో కాటన్, పట్టు నూలు ఇస్తుందన్నారు. కావాల్సిన వారు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.



# వరద ప్రవాహం... రక్షణ శూన్యం



జమ్మలమడుగు శివారు అయ్యప్ప ఆలయం వద్ద రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రాంతం

మైలవరం జలాశయం నుంచి అయిదు గేట్ల ద్వారా పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పెన్నా నదిలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. బుధవారం ఉదయం 5 వేల నుంచి పది వేల క్యూసెక్కులకు పెంచుతూ పెన్నాకు నీటిని విడుదల చేశారు. జమ్మలమడుగు- ముద్దనూరు వెళ్లే మార్గంలో పెన్నానది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వంతెన సమీపంలో అయ్యప్ప ఆలయం వద్ద వరద ప్రవాహం ప్రమాదకరంగా మారింది. అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఎవరైనా నదిలో దిగేందుకు ప్రయత్నిస్తే గల్లంతయ్యే ప్రమాదం ఉంది. సాయంత్రం 6.30 గంటల నుంచి 11 వేల క్యూసెక్కులకు నీటి విడుదల పెంచనున్నట్లు అధికారులు ప్రకటించారు. పెన్నా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయ్యప్ప గుడి వద్ద నదిలో దిగకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తెలిపారు. **-న్యూస్‌టుడే, జమ్మలమడుగు**

## నిబంధనలకు అనుగుణంగా బాణసంచా దుకాణాలు

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** దీపావళి అందరూ సంతోషంగా, ఆనందంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని బాధ్య కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్ల పరిధిలోని బాణసంచా దుకాణాలకు లైసెన్సులు ఇస్తున్నామని, నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల భద్రతాచర్యలు చేపట్టాలన్నారు. అనుమతుల్లేకుండా ఎక్కడా కూడా దుకాణం నిర్వహించకూడదని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవోలు అన్ని గోదాములు, దుకాణాలను పరిశీలించి నిబంధనలు పక్కాగా ఉన్నవారికి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, భానుశ్రీ, కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఫైర్ ఆఫీసరు సాయిధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న బాధ్య కలెక్టర్ అదితిసింగ్

## రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం



**కలసపాడు, న్యూస్‌టుడే:** మండలపరిధిలోని గిద్దలూరు ప్రధాన రహదారిపై శింగరాయపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల్దారి **షేక్ మస్తాన్‌వలి** (42) దుర్మరణం చెందారు. మండలపరిధిలోని కలసపాడు నుంచి తంబళ్లపల్లెకు బేల్దారి షేక్ మస్తాన్‌వలి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొంది. ఘటనలో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మస్తాన్‌వలికి ఆరేళ్ల కిందట తంబళ్లపల్లెకు చెందిన ఖలీజాబీతో వివాహమైంది. అప్పటి నుంచి తంబళ్లపల్లెలోనే ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో ఢీకొని మహిళ మృతి



**చక్రాయపేట, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. చక్రాయపేట మండలం కుమారకాల్వ హరిజనవాడకు చెందిన **నల్ల వెంకటాలమ్మ కమలమ్మ**(62) వేంపల్లెలో తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి బయలుదేరి ప్రధాన రోడ్డుపై నిలుచున్నారు. అదే మార్గంలో వస్తున్న ద్విచక్రవాహనదారుడిని వేంపల్లె వరకు తీసుకెళ్లమని కోరడంతో అతను సమ్మతించారు. కొద్ది దూరం వెళ్లగానే వారి వాహనాన్ని వెనుక నుంచి ఆటో ఢీకొంది. కమలమ్మ కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమెను తిరుపతి రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారని పోలీసులు తెలిపారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

**నార్సింగ్, న్యూస్‌టుడే:** వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధి హైదర్‌షాకోట్ హిమగిరినగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దువ్వూరు మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన సూర్య లక్ష్మీసాయి(26), వెంకటేష్‌ల వివాహం 2019లో జరిగింది. వీరికి నాలుగేళ్ల ఒక బాబు ఉన్నాడు. వెంకటేష్ ప్రైవేటు ఉద్యోగి. కొంత కాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భర్త విధులకు వెళ్లిన తర్వాత లక్ష్మి ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. ఇంటి ముందు వారి చిన్నారి ఏడుస్తూ కనిపించడంతో పక్కింటి వారు తలుపుతట్టగా, స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూశారు. లక్ష్మి ఉరేసుకుని కనిపించడంతో నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె పుట్టింటివారు వస్తున్నారని, వారితో మాట్లాడితే ఆత్మహత్యకు కారణాలు వెల్లడవుతాయని ఎస్ఐ తెలిపారు.

## లోయలో పడిన ఆయిల్ ట్యాంకర్



**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే:** కడప-రాయచోటి రహదారిలోని సీకేదిన్నె మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డు నాలుగో మలుపు వద్ద బుధవారం తమిళనాడు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి లోయలో పడింది. ఈప్రమాదంలో క్లీనర్ విష్ణువర్ధన్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్ పక్కకు దూకడంతో సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కడపలో భారీ చోరీ

### 55 తులాల బంగారు నగల అపహరణ

**కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో భారీ చోరీ జరిగింది. సుమారు 55 తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. కడప హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రవికుమార్ విద్యుత్తు భవన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. ఆయన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వీరు మూడు రోజుల కిందట హైదరాబాదు వెళ్లారు. వారి పిల్లలను నగరంలో బంధువుల వద్ద ఉంచారు. పిల్లలు ప్రతిరోజూ సాయంత్రం ఇంటికి వచ్చి మళ్లీ బంధువుల వద్దకు వెళ్లేవారు. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం వారు ఇంటికి రాగానే అప్పటికే బయట గడియ పగలగొట్టి ఉంది. వెంటనే విషయాన్ని బంధువులకు తెలియజేశారు. వారు పోలీసులకు చెప్పడంతో సీఐ రామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. వేలిముద్ర నిపుణులు వచ్చి ఆధారాలు సేకరించారు. దొంగలు బీరువా తెరిచి, అందులో ఉన్న సుమారు 55 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారని బాధితులు తెలిపారు.



# చెత్త సేకరణ సరే... వసతుల మాటేంటి?

**ఎస్‌డబ్ల్యూపీసీలపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం**

**సదుపాయాల కల్పనపై ఎన్డీయే సర్కారు కసరత్తు**

– న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

**గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛస్ఫూర్తితో ప్రతి గడప నుంచి చెత్తను సేకరించాలి. పల్లెసీమల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించాలని సదాశయంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీలు- సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్) నిర్మించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో మౌలిక వసతులను విస్మరించింది. నాటి సీఎం జగన్ సర్కారు నిర్వహణను గాలికొదిలేసింది. ఎన్డీయే కూటమి పాలకులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్నిచోట్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులున్నాయి, ఇంకా ఎలాంటి సదుపాయాలు అవసరమని సమాచారం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.**

✷ జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు 557 ఉన్నాయి. మొత్తం 3,23,541 కుటుంబాలు ఉండగా 13.20 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు. అయిదేళ్ల కిందట అప్పటి తెదేపా పాలనలో 537 చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. నరేగా పద్దు రూ.17 కోట్లకు పైగా వెచ్చించారు. ప్రతి గడప నుంచి తడి, పొడి వ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. క్లాప్‌మిత్రలు 1,291, కాపలాదారులు 538 మందిని నియమించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.ఆరు వేల వేతనం ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. అప్పట్లో చెత్త సేకరణ కొన్నాళ్లపాటు సవ్యంగా సాగింది. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో పనిచేస్తున్న సిబ్బందికి ఆరేడు నెలలకొకసారి కూడా వేతనాలు ఇవ్వలేదు.

| ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో వసతుల సమాచారం | | |
|---|---|---|
| అంశం | ఉన్నవి | లేనివి |
| విద్యుత్తు | 188 | 349 |
| తాగునీరు | 268 | 269 |
| రహదారులు | 431 | 106 |
| సూచికలు | 203 | 334 |
| చెత్త నిల్వ | 337 | 200 |

✷ మూడు చక్రాల రిక్షాలు 1,304, ట్రాక్టర్లు 48, ఆటోలు 44, ఎలక్ట్రికల్ ఆటోలు 28 ఇచ్చారు. చాలాచోట్ల రోడ్డు లేదు. సగానికి పైగా విద్యుత్తు సరఫరా కల్పించలేదు. గుక్కెడు నీరివ్వలేదు. కనీసం సూచికలు ఏర్పాటు చేయలేదు. చెత్త నిల్వ చేయడానికి అన్ని ప్రాంతాల్లో అనువైన తొట్టెలను నిర్మించలేదు. కొన్ని చోట్ల చేపట్టినా దెబ్బతిన్నాయి. వానపాముల ఎరువు ఉత్పత్తి చేయలేదు. పంచాయతీలకు ఆదాయం సమకూరడం లేదు.

✷ ఒంటిమిట్ట మండలం సాలాబాదు, గొల్లపల్లిలోని కేంద్రాల్లో మౌలిక వసతుల్లేవు. కడప డివిజన్‌లో 171 షెడ్లు ఉంటే 124 చోట్ల విద్యుత్తు ఊసే లేదు. సూచికలు 104 కేంద్రాలకు లేవు. జమ్మలమడుగు డివిజన్‌లోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో 50 శాతానికి పైగా తాగునీరు వసతి లేదు. బద్వేలులో 176 కేంద్రాలకు 124 చోట్ల విద్యుత్తు సరఫరా లేదు. గత అయిదేళ్లుగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులివ్వాలని పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు.



ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లెలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

దీంతో అధికార యంత్రాంగం కూడా చేసేదేమిలేక వదిలేశారు. ఎన్డీయే కూటమి పాలకులు కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో సన్నద్ధమవుతున్నారు.

### సమాచారం సేకరిస్తున్నాం

**చె**త్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అన్నిచోట్ల వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి ఎక్కడెక్కడ ఏం అవసరాలు కావాలో సమాచారం సేకరిస్తున్నాం. రహదారులు, తాగునీరు, విద్యుత్తు, కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తాం. సేంద్రియ ఎరువు తయారీ చేయించి రైతులకు విక్రయిస్తాం. పంచాయతీల ఆదాయాన్ని పెంచుతాం. క్లాప్‌మిత్రలు, కాపలాదారులకు వేతనాలు చెల్లిస్తాం. **- రాజ్యలక్ష్మి, డీపీవో, కడప**

## మహిళ మృతి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప రిమ్స్ ఠాణా పరిధిలో ఓ మహిళ మృతికి కారకుడైన వ్యక్తికి కడప కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కడప బుడ్డాయపల్లెలో ఓ మహిళ నివసిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ఆమె చనిపోవడానికి ప్రేరేపించాడు. దీంతో 2021, నవంబరులో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది. అప్పటి రిమ్స్ సీఐ నరేంద్రరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో వెంకటేష్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలపై సమీక్ష

**కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్ భవనంలో బుధవారం హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కడప డీఎస్పీ, రాయచోటి, పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారులు, బద్వేల్, జమ్మలమడుగు, కడప, అన్నమయ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు నిర్వహించిన సమావేశంలో తప్పిపోయిన పిల్లల కేసులపై చర్చించారు. రాయచోటి సబ్ జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను జడ్జి పరిశీలించారు.

## ‘తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి జగన్’




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే :** తల్లికి, చెల్లికి కూడా న్యాయం చేయలేని వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే ఆయన ముఖ్యమంత్రిగా పనికిరాడని ప్రజలు గత ఎన్నికల్లో స్పష్టమైన తీర్పునిచ్చారని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం జడ్పీ కార్యాలయంలో మాట్లాడుతూ బద్వేలులో బాలిక మరణానికి కారణమైన విఘ్నేష్‌ను పోలీసులు వెంటనే పట్టుకున్నారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా రాజకీయ లబ్ధి పొందేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత అయిదేళ్లలో గంజాయి, మత్తుపదార్థాలు, నాటుసారా సరఫరా భారీ ఎత్తున జరిగేలా చేసి యువతను జగన్ సర్కార్ పెడదారి పట్టించిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఎంతోమంది దళితులు హత్యకు గురయ్యారని, పలువురిపై దాడులు, అత్యాచారాలు జరిగాయని ఆరోపించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తలేదన్నారు.

## తెదేపా శాశ్వత సభ్యత్వానికి రూ.లక్ష అందజేత

**అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే:** తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రూ.లక్ష చెక్కు అందించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన సీఎంను కలిశారు. తొలిసారిగా రూ.లక్ష చెల్లించిన గోవర్ధన్‌రెడ్డికి తానే స్వయంగా సభ్యత్వ పత్రం అందిస్తానని చంద్రబాబు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

## మహిళా ఉద్యోగులపై వేధింపులు తగవు

**కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులపై వేధింపులు ఆపాలని ఏపీ ఐకాస అమరావతి మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి డిమాండు చేశారు. ఉద్యోగినులు తమ సమస్యలు తెలిసేందుకు జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో షీ బాక్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కడపలోని ఆర్టీసీ ఈయూ కార్యాలయంలో బుధవారం ఏపీ ఐకాస అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ ఛైర్‌పర్సన్ మేరీవిజయకుమార్ అధ్యక్షత వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ వేధింపులను కట్టడి చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం ప్రతినిధులు శారద, అనురాధ, సుజాత, పద్మావతి, ప్రియాంక, శైలజ, యూనియన్ నాయకులు బోసుబాబు, రామమూర్తి, రఘురామ్‌గౌడ్, బాలవెంకటేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏపీఐకాస అమరావతి మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి

## జాతీయ పశువైద్య సదస్సు ప్రారంభం

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు ప్రభుత్వ వెటర్నరీ కళాశాలలో ఈ నెల 23 నుంచి 25 వరకు జాతీయ పశువైద్య సదస్సు నిర్వహణలో భాగంగా తిరుపతి శ్రీ వేంకటేశ్వర పశుసంవర్ధక విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ) వీసీ డాక్టరు జేవీ రమణ, ఎస్వీఎస్‌బీటీ అధ్యక్షుడు ఏజే ధామి గురువారం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సొసైటీ ఫర్ వెటర్నరీ సైన్సెస్, బయోటెక్నాలజీ (ఎస్వీఎస్‌బీటీ), ఎస్వీవీయూ ఆధ్వర్యంలో ఈ సదస్సులో సావనీరు ప్రతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టరు రమణ మాట్లాడుతూ.. ‘పశువులు, పౌల్ట్రీలో ఆరోగ్యం, ఉత్పాదకతను పెంపొందించడానికి స్థిరమైన జీవనోపాధులు’కు శాస్త్రీయ పరిశోధనలు, ప్రయోగాలు, సత్ఫలితాలను సాధించడంలో దేశ, విదేశాల్లో శాస్త్రవేత్తలు ముందంజలో ఉన్నట్లు తెలిపారు. ఆయా అంశాలకు సంబంధించి ఆవిష్కరణలు, శాస్త్రీయ పరిజ్ఞానంపై అవగాహన, నైపుణ్య ప్రమాణాలను వినియోగించడంతో గణనీయమైన ప్రగతి, అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పశు సంపద పరిరక్షణకు ఆధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దేశ, విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు తమ పరిశోధనలకు సంబంధించి అంశాలపై విస్తృత ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన శాస్త్రవేత్తలకు సన్మానంతో పాటు జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీవీయూ డీన్ డాక్టరు వీర బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టరు శ్రీనివాస ప్రసాదు, ఎస్వీఎస్‌బీటీ కార్యదర్శి కేకే హదియా, హెచ్‌వోడీ, అసోసియేట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఎస్వీవీయూ వర్సిటీ వీసీ డాక్టరు రమణ, ఎస్వీఎస్‌బీటీ ప్రతినిధులు

## స్థిరాస్తి వ్యాపారంలో మనస్పర్ధలతోనే దాడి

**తెదేపా నగర అధ్యక్షుడిపై దాడి ఘటనలో నలుగురు అరెస్టు**



వివరాలను వెల్లడిస్తున్న చిన్నచౌకు సీఐ తేజమూర్తి, పక్కన ఎస్సైలు రవికుమార్, రాజరాజేశ్వరరెడ్డి

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** తెదేపా నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి ఘటనకు సంబంధించి బాలిశెట్టి రవితేజ, మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ తేజమూర్తి బుధవారం వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కడప అశోక్‌నగర్‌కు చెందిన బాలిశెట్టి రవితేజ, శివకొండారెడ్డి కలసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరి మధ్య గతం నుంచి చిన్నపాటి మనస్పర్థలున్నాయి. శివకొండారెడ్డి కొన్ని రోజుల కిందట రవితేజకు ఫోన్ చేసి రియల్టర్‌ను బెదిరించి రూ.30 లక్షలు తీసుకున్నావా అని ప్రశ్నించారు. దీంతో మనస్తాపానికి గురైన రవితేజ తన స్నేహితుడైన అక్కాయపల్లెకు చెందిన రౌడీషీటర్ దీపక్‌కు ఈ విషయాన్ని చెప్పాడు. దీంతో వారు శివకొండారెడ్డికి గుణపాఠం చెప్పాలని మరో స్నేహితుడైన రవీంద్రనగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ ఇంతియాజ్, అక్కాయపల్లెకు చెందిన బాలుడితో కలిసి రెక్కీ నిర్వహించారు. ప్రతి రోజు ఆయన అప్సర సమీపంలో దుకాణం వద్దకు టీ తాగడానికి వస్తారని గుర్తించారు. ఈనేపథ్యంలో ఈనెల 19న ఉదయం వారు నలుగురు కలిసి రెండు ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. టీ తాగి ఇంటికి వెళ్తున్న శివకొండారెడ్డికి ద్విచక్రవాహనం అడ్డు పెట్టి కర్రలతో ఇంతియాజ్ దాడి చేశాడు. బాధితుడి వీపు, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు నిందితులను కడప శివారులోని రింగ్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

**కొసమెరుపు.... :** అధికారం పార్టీకి చెందిన నగర అధ్యక్షుడిపై పట్టపగలు దుండగులు కర్రలతో దాడి చేసిన ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. నిందితులు ఎవరనే దానిపై చర్చ సాగుతోంది. పోలీసులు ఈ స్థాయి కేసుకు మీడియాకు చూపించకుండా, అరెస్టు చేసి పత్రికలకు ప్రకటన పంపించారు. చిన్న చిన్న ఘటనలపై సమావేశాలు పెట్టి హడావుడి చేసే పోలీసులు ఇంత పెద్ద స్థాయిలో ఘటన జరిగితే గుట్టుచప్పుడు కాకుండా నేరుగా కోర్టుకు హాజరుపరచడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

## 29 నుంచి ఆల్ ఇండియా సర్వీసెస్ టోర్నమెంట్

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చర్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ (సీసీఎస్‌సీ అండ్ ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపికలు జరుగుతాయని రెండు జిల్లాల డీఎస్‌డీవో ప్రతినిధులు పేర్కొన్నారు. పోటీలు రాయచోటి, కడప నగరాల్లోని డీఎస్ఏ మైదానాల్లో జరుగుతాయన్నారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 94402 97692(అన్నమయ్య), 90001 82966 (వైఎస్ఆర్) నెంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

## పాస్టర్లకు గౌరవవేతనం చెల్లించాలి

**అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లె విజయభాస్కర్ డిమాండ్ చేశారు. కడపలోని బెతనీయ ప్రార్థనా మందిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూపర్‌సిక్స్ పథకాలకు అదనంగా క్రైస్తవులకు కూడా ప్రత్యేక నిధి కేటాయించి వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. డాక్టర్ థామస్‌రెడ్డి, పీటర్, రమేష్‌రెడ్డి, బిషప్ శామ్యూల్‌బాబు, సామేల్, శుభాకర్, విజయశేఖర్, ప్రభుదాస్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## కడప పెద్ద దర్గా సందర్శన

**కొండాపురం, న్యూస్‌టుడే :** కడప పెద్ద దర్గాను సినీ నటుడు రాజ్‌కుమార్ బుధవారం సందర్శించారు. దర్గా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. దర్గాలో రాజ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. దర్గాకు రావడంతో చాలా ప్రశాంతత కలిగిందని పేర్కొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సినీ నటుడు రాజ్‌కుమార్

## ఉద్యానం... అధ్వానం



**ఇ**టీవల కురిసిన వర్షాలకు ఎస్‌బీఐ కాలనీలో పార్కు మొత్తం నీటితో నిండిపోయింది. కాలనీ మొత్తం ఇలానే ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి నీరు నిల్వ ఉండడంతో పెద్దలు వాకింగ్‌కు, పిల్లలు ఆడుకునేందుకు కూడా వీల్లేకుండా పోయింది. అధికారులు స్పందించి నీటిని బయటికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- ఈనాడు, కడప**

## సీపీ బ్రౌన్ కేంద్రానికి మరమ్మతులు చేయండి

**వైవీయూ (కడప), న్యూస్‌టుడే:** కడప నగరంలోని సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రంలో కొన్ని చోట్ల స్లాబు పగుళ్లిచ్చి పెచ్చులూడుతుందని, మరమ్మతులు చేయాలని బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ పేర్కొన్నారు. వైవీయూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.



పగుళ్లిచ్చిన పైకప్పు

## జిల్లా సమగ్రాభివృద్ధికే మహాసభలు

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** డిసెంబరు 14, 15 తేదీల్లో సీపీఎం జిల్లా మహా సభలు కడప నగరంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మనోహర్ తెలిపారు. నవంబరు 20న జమ్మలమడుగు నియోజకవర్గ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పట్టణ కార్యదర్శి ఏసుదాసు, వినయ్‌కుమార్, దాసరి విజయ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 11 లోగా ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించండి

**కడప విద్య, న్యూస్‌టుడే :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు నిర్దేశిత ఫీజులను నవంబరు 11వ తేదీ లోగా చెల్లించాలని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐవో) బండి వెంకటసుబ్బయ్య ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.1,000 తో నవంబరు 12 నుంచి 20వ తేదీ వరకూ చెల్లించవచ్చని తెలిపారు. హాజరు మినహాయింపుతో ప్రైవేట్ అభ్యర్థులుగా పరీక్షలు రాసేందుకు నవంబరు 15వ తేదీలోగా రూ.1,500 ఫీజు చెల్లించాలని చెప్పారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** బద్వేలులో బాలికను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ ఘటనను పలువురు రాజకీయం చేసుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరు వెళ్లి డబ్బులు ఇచ్చినంత మాత్రాన ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. యువత పెడదోవ పట్టడానికి ప్రధానకారణం సామాజిక మాధ్యమాలే కారణమని, వీటిపై యువతకు తల్లితండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన పలువురు పార్టీలో చేరారు. పార్టీ నాయకులు శ్యామలమ్మ, ప్రసాద్‌గౌడ్, సిరాజుద్దీన్, సలావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## సెంచరీలతో సత్తా చాటిన బ్యాటర్లు

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా కడపలో జరుగుతున్న మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. రెండోరోజు బుధవారం బ్యాట్స్‌మెన్ సెంచరీలతో సత్తా చాటారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడపతో జరిగిన మ్యాచ్‌లో రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 330/9 పరుగులు చేసింది. తనీశ్వర్ టెండూల్కర్ సెంచరీ (104, 174 బంతుల్లో, 16×4)తో సత్తాచాటగా, అభిరామ్‌యాదవ్ 47 పరుగులు చేశాడు. కృష్ణ చైతన్య 2, ఫైజాన్ 3 వికెట్లు తీశారు. కడప మొదటి ఇన్నింగ్స్ స్కోరు: 316/8

✦ కేవోఆర్ఎం మైదానంలో పశ్చిమగోదావరితో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 82/0తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన విశాఖ జట్టు 310/3 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తమన్‌రెడ్డి సెంచరీ(100*, 131 బంతుల్లో, 12×4, 6×2)తో చెలరేగగా, అక్షిత్‌రెడ్డి 74, వినోద్ 70* పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ప.గో జట్టు ఆట ముగిసే సమయానికి 126/4 స్కోరు చేసింది. కేపీ నారాయణ సెంచరీ (100*, 138 బంతుల్లో, 7×4, 6×5)తో మెరిశాడు. ప.గో మొదటి ఇన్నింగ్స్: 112



తనీశ్వర్



తమన్



నారాయణ



సాకేత్

✦ కేఎస్ఆర్ఎం మైదానంలో కర్నూలుతో జరిగిన మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 64/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన తూ.గో జట్టు 67.4 ఓవర్లలో 274 పరుగులు చేసింది. కె.కృష్ణసాకేత్‌రెడ్డి సెంచరీ(113, 94 బంతుల్లో, 7×4, 6×6)తో శతకొట్టగా, కార్తీక్ 89 పరుగులు చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 117/7 స్కోరు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.

## బైక్‌పై విన్యాసాలు చేసి... ఆర్టీసీ బస్సును ఢీకొని...

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప పాతబస్టాండులో అవధూతేంద్రస్వామి ఆలయం ముందు నుంచి బుధవారం సాయంత్రం విద్యార్థులు నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. అదే సమయానికి ఓ యువకుడు అత్యాధునిక ద్విచక్రవాహనంపై అక్కడికి వచ్చాడు. అమ్మాయిలు వెళ్తుంటే వారి ముందు ఫోజులిచ్చేందుకు ద్విచక్రవాహనం ముందు టైరును పైకి లేపి విన్యాసాలు చేశాడు. అదుపు చేసుకోలేక కడప నుంచి మైదుకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగాన్ని ఢీకొన్నాడు. ఆ వేగానికి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు, పోలీసులు వచ్చి యువకుడిని ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అతను మద్యంమత్తులో ఉన్నాడు. ప్రమాదంలో బస్సు బంపర్ రాడ్ దెబ్బతింది. ద్విచక్రవాహనం ముందుభాగం నుజ్జునుజ్జు అయింది.

# ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

## గ్రామీణాభివృద్ధికి పల్లెపండగ


భూమి పూజలో పాల్గొన్న తెదేపా జమ్మలమడుగు బాధ్యుడు భూపేష్‌రెడ్డి, భాజపా నేత శివనారాయణరెడ్డి, నాయకులు

**కొండాపురం, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని తెదేపా జమ్మలమడుగు బాధ్యుడు భూపేష్‌రెడ్డి, భాజపా సీనియర్ నాయకుడు శివనారాయణరెడ్డి అన్నారు. చామలూరులో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన మంచి నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, రామాంజుల్‌రెడ్డి, సర్పంచి రాఘవేంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటించండి


సిబ్బందితో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ వరద కిశోర్‌రెడ్డి

**ముద్దనూరు, న్యూస్‌టుడే:** స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సాయిశ్రీ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. కార్యాలయంలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు తెలుసుకొని వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు తగిన సమయంలోగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. తహసీల్దార్ వరద కిశోర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా మండల పూజ


స్వామివారికి తిరుకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే :** బద్వేలు ప్రాంతంలోని చెన్నవరం గ్రామంలో బుధవారం పట్టాభిరామ స్వామి ఆలయంలో వైభవంగా మండల పూజ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు నేత్రపర్వంగా తిరు కల్యాణం నిర్వహించారు.

## భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**కొండాపురం :** ప్రసిద్ధి చెందిన శ్రీ నీల మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో శ్రీమహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, పార్వతీదేవీ, ఆదిత్యాది నవగ్రహ, ధ్వజస్తంభ, నందీశ్వర కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీ రాచకుండ జానకి రామయ్యశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## జగన్ పర్యటనలో అపశ్రుతి


కార్యకర్తల తోపులాటలో కాలువలో పడిన మహిళలు, తదితరులు

బద్వేలులో బాధిత కుటుంబానికి పరామర్శ చేడానికి వచ్చిన మాజీ సీఎం జగన్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. తమగోడు చెప్పుకోవడానికి వచ్చిన మహిళలు జగన్‌ను కలిసేందుకు రాగా, ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఘటనలో మహిళలు, కార్యకర్తలు మురుగు కాలువలో పడిపోయారు. కాలువ తక్కువ లోతు ఉండటంతో ప్రమాదం తప్పిందని సమస్యలు చెబుతామని వచ్చిన తమకి ఇలా జరగడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. - **ఈనాడు, కడప**

## సాహితీ లోకానికి తీరనిలోటు


భాస్కర రాజు (పాత చిత్రం)

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే :** ప్రొద్దుటూరు రామేశ్వరానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త, విద్వాన్ వి.ఎం.భాస్కర రాజు (78) కడప ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన ఆత్మ శాంతించాలని రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం సంతాపం తెలిపారు. 35 ఏళ్ల పాటు తెలుగు పండితుడిగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసి 2010లో ఉద్యోగ విరమణ పొందారని, పద్య కవి, తబలా వాయిద్యంతో పాటు రామలింగ శతకం, కవితా విలాపం మొదలైన కవిత సంకలనాలను వెలువరించి, అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని ప్రముఖుల ప్రశంసలు అందున్నారు. ఆయన తుదిశ్వాస విడవడం సాహితీ లోకానికి తీరని లోటని తెలిపారు.

## రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి

**జమ్మలమడుగు, బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే :** ఈ నెల 29, 30 తేదీల్లో కడప వేదికగా జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, జిల్లా కార్యదర్శి శివకుమార్ వేర్వేరుగా పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు.

## పాఠశాలకు మంచి పేరు తీసుకురండి

**ముద్దనూరు :** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో కృష్ణప్ప బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని స్పష్టం చేశారు. హెచ్ఎం ఆవుల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

**కాశినాయన :** మండల పరిధిలో గతంలో రౌడీషీటర్లగా ఉన్న, కేసులు నమోదు చేసిన వారి చిత్రాలను మంగళవారం నరసాపురం పోలీస్‌స్టేషన్ నోటీసు బోర్డులో అతికించారు. వీరి చిత్రాలను కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీన్ని నిరసిస్తూ రైతు సంఘం నాయకులు, తదితరులు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపట్టారు. తహసీల్దార్, ఎస్ఐకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయమై ఎస్.ఐ హనుమంతును వివరణ కోరగా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్ల చిత్రాలను నోటీసు బోర్డులో పెట్టామన్నారు.

## జమ్మలమడుగు డివిజన్ ఛైర్మన్ ఎన్నిక

**జమ్మలమడుగు :** ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం డివిజన్ ఛైర్మన్‌గా జమ్మలమడుగుకు చెందిన షేక్షావలి నియమితులయ్యారు. కడపలో బుధవారం జిల్లా సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపకులు, జాతీయ ఛైర్మన్ కోనయ్య హాజయ్యారు. జమ్మలమడుగు డివిజనల్ ఛైర్మన్‌గా షేక్షావలి నియామక పత్రం అందుకున్నారు.



# సమస్యలు దండి... పరిష్కారం లేదండి...!

### పునరావాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కరవు

**కొండాపురం, న్యూస్‌టుడే:** కొండాపురం మండలంలో 38 రెవెన్యూ గ్రామాలుండగా, 42,093 జనాభా ఉంది. ఇందులో 52 గ్రామాలుండగా 21 గ్రామాలు గండికోట జలాశయం పరిధిలో ముంపునకు గురయ్యాయి. మిగిలిన గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా కొండాపురం, ఎర్రగుడి, చామలూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో సీసీ రోడ్డు, మురుగు కాలువలు, తదితర మౌలిక వసతుల పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాల్లో మురుగు పారుదలకు కాలువల్లేక చిన్నపాటి వర్షానికి సైతం అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. కొండాపురం పంచాయతీ పరిధిలోని రామసుబ్బారెడ్డి కాలనీలో ఏళ్లు గడుస్తున్నా సీసీ రోడ్డుకు నోచుకోలేదు. సుమారు ఆరు నెలల కిందట కాలనీలో కంకరపరిచి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.


కొట్టాలపల్లెలో రోడ్డుపై మురుగు నీరు


కొండాపురం రామసుబ్బారెడ్డి కాలనీలో కంకర పరిచి వదిలేశారు ఇలా..

### కొండాపురంలో పారిశుద్ధ్యం అధ్వానం

### చేయాల్సిన పనులు ఇవే...

● కొండాపురంలోని శాంతినగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించినా మురుగు కాలువల ఏర్పాటు మరిచారు. మురుగు పారే మార్గం లేక ఇళ్ల ముందు గుంతలు తవ్వుకున్నారు. మరికొన్ని చోట్ల మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది.

● కొండాపురం జడ్పీ పాఠశాల గండికోట జలాశయం పరిధిలో ముంపు జాబితాలో ఉంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతన భవనం నిర్మించకపోవడంతో పాత గ్రామంలోని పాఠశాలకు విద్యార్థులు రైల్వే ట్రాక్ దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. అధికారులు భవన నిర్మాణానికి స్థలాల్ని గుర్తించినా నిర్మాణాలు జరగలేదు. అలాగే వివిధ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

● కొండాపురం గ్రామానికి ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక స్థలం తక్కువగా ఉండటంతో ఇబ్బంది కలుగుతోంది. మరోచోట శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరీ, నీటి సదుపాయం, గదులు ఏర్పాటు చేయాలి.

● బ్రిటీష్ కాలం నుంచి కొండాపురంలో అన్ని రైళ్లు ఆగేవి. కొవిడ్ తర్వాత రైలు నిలుపుదల చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అనేక సార్లు ధర్నాలు, నిరసనలు తెలిపారు. ఈ విషయమై పలు సార్లు రైల్వే ఉన్నతాధికారులు వినతిపత్రాలు అందజేశారు.

● కొండాపురంలో కుక్కల సంచారం అధికంగా ఉంది. ప్రధాన రహదారిపై గుంపులుగా సంచరించడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పలువురు ద్విచక్ర వాహనదారులు గాయపడిన సంఘటనలున్నాయి.

● చిన్నపల్లె గ్రామంలోకి వర్షం నీరు చేరుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాన్ని ముంపు జాబితాలో గుర్తించినా పరిహారం అందలేదు.

● బస్టాండు ముంపు జాబితాలోకి చేరడంతో కొత్త బస్టాండు కోసం దాతలు ఒక ఎకరా స్థలం ఉచితంగా ఇచ్చినా నిర్మాణం ఇప్పటికీ చేపట్టలేదు.

### రహదారి ఎప్పుడు నిర్మిస్తారో?



మా కాలనీలో మురుగు కాలువలు, సీసీ రోడ్డు లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారుతోంది. సుమారు ఆరు నెలల కిందట సీసీ రోడ్డు వేయడానికి కాలనీలో కంకరపరిచి పనులు ప్రారంభించకపోవడంతో ఇబ్బందిగా మారింది.
- **నాగసుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి కాలనీ, కొండాపురం**

### చర్యలు తీసుకుంటాం

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే పలు కాలనీల్లో, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువల్లోని వ్యర్థాలను శుభ్రం చేయించాం. అలాగే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.
- **నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం**

## సచివాలయాల తనిఖీ

**జమ్మలమడుగు :** స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 15, 16, 17, 18 వార్డుల పరిధిలోని సచివాలయాలను బుధవారం కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రింటర్ పనిచేయక పోవడంతో జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు ఇతర ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు నూతన ప్రింటర్లు కొనుగోలు చేయాలని వార్డు అడ్మిన్‌లను ఆదేశించారు. ఇదే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఉందని ప్రహరీ లేక ఇబ్బందిగా ఉందని చెప్పడంతో పరిశీలించి నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు పోలీసు లలిత, పోలీసు చంద్ర, విశ్వనాథరెడ్డి, ఐవిలే చిన్నా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రీసర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సులు

**ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చిన్నదండ్లూరు, ఇల్లూరు గ్రామాలలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై తహసీల్దారు శోభన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రీసర్వేలో వచ్చిన భూ సమస్యలను తహసీల్దార్ రైతులను అడిగి తెలుసుకున్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక


పొట్లదుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు పద్మనాభరావు

**ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని పొట్లదుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో, యోగా, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం ప్రధానోపాధ్యాయురాలు పద్మనాభరావు తెలిపారు. ఖోఖో అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో మహబూబ్‌బాషా, వై.అశ్విని, సి.దేవి, ఖోఖో అండర్-14, 18 విభాగాల్లో అనుపమ, వరణ్, అశ్విని, శివాని, యోగాలో పావని, నాగసిరి, భవిత, లహరి, డి.హర్షవర్ధన్, ఐశ్వర్యవర్ధన్, టేబుల్ టెన్నిస్‌లో గౌసేదర్, అథ్లెటిక్‌లో సుష్మితలు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, జస్సీ రాణి పాఠశాల సిబ్బంది అభినందించారు.

**చాపాడు :** దిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఛైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఇటీవల కడప డీఎస్ఏ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. బాస్కెట్‌బాల్‌లో శర్వాణి, జేష్ఠసాయి, చదరంగంలో అభిరామన్, క్రికెట్‌లో ఉమర్ సిద్దిక్, చేతన్‌రెడ్డి, నెట్‌బాల్‌లో గ్యాన్, స్కేటింగ్‌లో విజయవర్ధన్‌శాస్త్రి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రవీంద్రకుమార్ వివరించారు.

**ప్రొద్దుటూరు :** ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో ప్రొద్దుటూరు విద్యార్థులు సత్తా చాటారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే వీరభవిత, డీబీసీఎస్ పురపాలక ఉన్నత పాఠశాలలో చదివే ఆయేష్, స్మైలీ, చిన్నిలు ఉత్తమ ప్రతిభ చాటి కాంస్య పతకాలు సాధించారని ఆ పాఠశాలల పీఈటీలు అల్లబకాష్, రాఘవ తెలిపారు.

## నైతిక విలువలపై అవగాహన


విజేతలతో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** విద్యార్థులు సేవా దృక్పథం అలవరచుకోవాలని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, గౌరవ సలహాదారుడు రాజోలి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం 'తల్లిదండ్రుల ప్రాధాన్యత - నైతిక విలువలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్‌వో నాగమల్లీశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాడు నిర్లక్ష్యం... నేడు అభివృద్ధి పథం

న్యూస్‌టుడే, మైదుకూరు

గత వైకాపా అయిదేళ్ల పాలనలో అభివృద్ధి పడకేసింది. గ్రామాలతో పాటు పట్టణాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సైతం దారి మళ్లించడంతో దుస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలు అభివృద్ధిని ఆశిస్తున్నారు. మైదుకూరు పురపాలకను అభివృద్ధిపథంలో నడిపించేలా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక దృష్టిసారించారు. డీఎంఎఫ్ గ్రాంట్ కింద రూ.79 లక్షలు మంజూరు చేయించారు. మంజూరు చేసిన రూ.93.94 లక్షల 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులతో పురపాలకలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కౌన్సిల్ సమావేశంలో చేసిన తీర్మానాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.

● పురపాలకలో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పలు ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. దీంతో రూ.14 లక్షలతో కొత్తగా విద్యుత్తు దీపాలను డీఎంఎఫ్ నిధులతో కొనుగోలు చేయనున్నారు. తెదేపా హయాంలో నాలుగురోడ్ల కూడలిలో ట్రాఫిక్ ఐలాండ్ పనులు చేపట్టినా సుందరీకరణ పనులు చేపట్టలేదు. దీంతో కళావిహీనంగా ఐలాండ్ దర్శనమిస్తోంది. ఈ పరిస్థితిని మార్చేలా భారీ జాతీయ పతాకంతో పాటు వీధి దీపాల ఏర్పాటుకు రూ.10 లక్షలు కేటాయించారు. పట్టణంలో కృష్ణదేవరాయులు, పొట్టిశ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలను రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్నారు. ఎల్లంపల్లె సమీప గగ్గితిప్పకు తరలించిన పశువుల సంతను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి మార్కెట్ కమిటీ ఆవరణానికి మార్పు చేశారు. మార్కెట్ కమిటీ ఆవరణాన్ని మట్టితో చదును చేసేలా రూ.5లక్షలు కేటాయించారు. స్థానిక సామాజిక ఆసుపత్రిలో పరికరాల కొనుగోలుకు రూ.20లక్షలు కేటాయించారు. వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ నాటికి డీఎంఎఫ్ గ్రాంటు కింద మంజూరు చేసిన రూ.79 లక్షల విలువైన పనులు పూర్తి చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పుర అధికారులు కసరత్తు చేస్తున్నారు.


మైదుకూరు నాలుగురోడ్ల కూడలిలో ఐలాండ్

### రూ.62.63 లక్షలతో సిమెంట్ రోడ్లు

15వ ఆర్థిక సంఘం కింద 2022-23లో మొదటివిడత కింద మంజూరైన నిధుల నుంచి రూ.62.63 లక్షలతో పట్టణంలోని ఏడు వార్డుల్లో 9 సిమెంట్‌రోడ్డు పనులు, ఒకచోట మురుగుకాలువ పనులు చేపడుతున్నారు. రూ.46 లక్షలతో తాగునీటి పనులు, రూ.41.80లక్షలతో మురుగునీటి శుద్ధి పనులు, రూ.41.85 లక్షలతో డంపింగ్‌యార్డులో పనులు చేపట్టేందుకు కేటాయించారు.

### నిధులు మంజూరు కాగానే పనులు

15వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టే 13 పనులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పురపాలక పరిపాలనా విభాగం అధికారులకు నివేదించాం. డీఎంఎఫ్ నిధులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం అనంతరం కలెక్టరు కార్యాలయానికి పంపాం. నిధులు మంజూరు కాగానే టెండరు ప్రక్రియ నిర్వహించి పనులు చేపడతాం. - **విశ్వకిరీటి, ఏఈ, పురపాలక**

## పత్తి సాగులో యాజమాన్య పద్ధతులపై సూచనలు

**ఖాజీపేట, న్యూస్‌టుడే:** పంటల సాగులో భాగంగా డ్రోన్ వినియోగంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఖాజీపేట-2, చెముళ్లపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం మండల వ్యవసాయాధికారి నాగార్జున ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ పాల్గొని డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి సాగులో యాజమాన్య పద్ధతులపై ఏఓ నాగార్జున రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ముద్దనూరు :** కంది పంటలో రసం పీల్చే పురుగు నివారణ చర్యల గురించి మండల వ్యవసాయ అధికారి మారెడ్డి కృష్ణారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శెట్టివారిపల్లె రైతు సేవా కేంద్రాల పరిధిలో కంది పంటను ఆయన పరిశీలించారు. కందిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రైతులు పాల్గొన్నారు.



## అంత్యక్రియలు



మీరు మాకు పంచిన ప్రేమామృతం మా గుండెల్లో పదిలం...
మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మీ మరణం మాకు తీరనిలోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కసిరెడ్డి బాలీశ్వరమ్మ గారు
జననం : 1928 మరణం : 23/10/2024

కుమారుడు : కె.కె.ప్రసాద్‌రెడ్డి
కోడలు : శ్రీమతి కె.రాజేశ్వరి
మనుమడు : కె.అమరేశ్వర్‌రెడ్డి
మనుమరాలు : శ్రీమతి మమత
మునిమనుమరాలు : కె.శాన్వికారెడ్డి

అంత్యక్రియలు : 24/10/2024 గురువారం ఉ॥ 10 గం॥లకు ప్రొద్దుటూరు సాయికుటీర్ రోడ్డులోని మా స్వగృహం నుండి అంతిమయాత్ర నిర్వహించబడును.

## అశ్రునివాళులు



మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన
కీ॥శే॥ జింకా ఆదిలక్ష్మమ్మ గారు
23.10.2024 వ తేదీ స్వర్గస్తులైనారు.
దైవసన్నిధిలో వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ జింకా ఆదిలక్ష్మమ్మ
3-1572, హోమస్‌పేట, ప్రొద్దుటూరు.
Cell : 9494800757.

భర్త : కీ॥శే॥ జింకా చిన్నరామసుబ్బయ్య

| కుమారుడు : | కోడలు : | మనుమలు, మనుమరాండ్రు : |
|---|---|---|
| జింకా రవీంద్రకుమార్ | శ్రీమతి ప్రశాంతి | లలిత్‌బాలాజి, హేమ్‌కమల్‌నాథ్ |
| కుమార్తెలు : | అల్లుళ్లు : | |
| శ్రీమతి చంద్రవిజయ | సి.సూర్యనారాయణ | దేవిశ్రీసింధు |
| శ్రీమతి సునీత | బి.నరసింహ | నేహశ్రీ, తనీష్‌కుమార్ |
| శ్రీమతి అరుణకుమారి | ఎ.వి.నవీన్‌కుమార్ | ఆర్యన్‌శ్రీరామ్, ప్రిన్స్‌అభినయన్ |

మరియు కుటుంబ సభ్యులు

అంత్యక్రియలు : 24.10.2024వ తేదీ గురువారం ఉదయం 10.00 గంటలకు ఆర్టీపీపీ రోడ్డు, రామేశ్వరం, ప్రొద్దుటూరులోని హిందూ శ్మశానవాటిక నందు నిర్వహించబడును.

## పెద్దకర్మ



జననం : 16.04.1954
మరణం : 14.10.2024

కీ॥శే॥ శ్రీమతి గంగిరెడ్డి జయలక్ష్మమ్మ
మిట్టమడి వీధి, ప్రొద్దుటూరు.

నీవు మా నుండి భౌతికంగా దూరం అయినా నీ మధుర జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా హృదయాల్లో పదిలంగా నిలిచి ఉంటాయి. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం.

భర్త : జి.శ్రీరామిరెడ్డి

| కుమారులు : | కోడళ్ళు : | మనుమరాళ్లు : |
|---|---|---|
| కీ॥శే॥ జి.రాఘవేంద్రారెడ్డి | - హేమలత | సుసాన్విరెడ్డి, సుచార్విరెడ్డి |
| జి.చంద్రమౌళిరెడ్డి | - గీతాంజలి | మనుమడు : సురోహిత్‌రెడ్డి |

పెద్దకర్మ : 24-10-2024 గురువారము ఉ॥ 9.00 గం॥లకు మిట్టమడి వీధి (రవీంద్ర హైస్కూల్ పక్క సందు), ప్రొద్దుటూరు లోని మా స్వగృహం నందు జరుగును.

# కడప
• కడప • పులివెందుల • కమలాపురం

## సమాజసేవకు సహకారం అందిస్తాం


కమిషనర్ మనోజ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

**ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే:** మానవతా సంస్థ చేస్తున్న సేవలకు తప్పకుండా సహకారం అందిస్తానని కమిషనర్ మనోజ్‌రెడ్డి చెప్పినట్లు మానవతా సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నూతన నగర కమిషనర్ మనోజ్‌రెడ్డిని మానవతా సంస్థ ప్రతినిధులు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డైరెక్టర్ రాటాల గోపి, ఎన్.సహదేవరెడ్డి, రామాంజనేయరెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

**వేముల, న్యూస్‌టుడే:** గొందిపల్లె పంచాయతీలోని చిన్నగొందిపల్లెలో నూతన అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు బుధవారం గ్రామస్థులు భూమి పూజ చేశారు. వారు విరాళాలు సేకరించి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సర్పంచి నారాయణమ్మ, నిర్వాహకులు రామకృష్ణ, సదాశివుడు, మునిశయ్య, రామాంజనేయులు, రమణ, ఓబులేసు, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

**స్పందనకు వందనం**

● నగరంలోని పలు సమస్యలపై ఈనాడు లో ప్రచురితమైన కథనాలకు నగరపాలక అధికారులు స్పందించారు. స్థానిక మారుతీనగర్‌లోని బీసీఈవీ అర్బన్ ప్రాజెక్టు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న చెత్తను సిబ్బంది తొలగించారు.
● రమేష్ థియేటర్ ఎదురువీధిలోని పాఠశాల వద్ద ఉన్న చెత్తను కార్పొరేషన్ సిబ్బంది తరలించారు.
● ఇందిరమ్మ సర్కిల్ నుంచి పాతరిమ్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. - న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)

?: పెండ్లిమర్రి నుంచి కొత్త సంగటిపల్లెకు వెళ్లే మార్గంలో రోడ్డు పైన చెట్ల చెదరాలు పేరుకుపోయాయి. -చెన్నారెడ్డి, చోడకుడు
✓: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి, పెండ్లిమర్రి - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

## దేవుడా... నీవే దిక్కు

న్యూస్‌టుడే, దేవునికడప

తిరుమల తొలిగడపగా ప్రసిద్ధి పొందిన దేవుని కడపలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గంగమ్మ గుడి వీధికి, ఉక్కాయపల్లెకు వెళ్లే మార్గంలో రహదారి మీదే చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. పందులు సంచరిస్తూ పరిస్థితిని మరింత దయనీయంగా మారుస్తున్నాయి. ఆ మార్గంలో కొంతదూరమే సిమెంటు రోడ్డు ఉండగా, మిగతా ప్రాంతం గుంతలమయంగా మారింది. దీంతో ఓ వైపు గుంతలు, వాటిల్లో చేరిన నీరు, మరోవైపు చెత్త కుప్పలు, పందుల సంచారంతో ఆ ప్రాంతం డంపింగ్ కేంద్రంగా తయారైంది. దీంతో రోగాల పాలవుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారే కరవయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గంగమ్మ గుడి వీధి- ఉక్కాయపల్లె మార్గంలో పేరుకుపోయిన చెత్త

### దోమలకు నిలయం



రోజుల తరబడి చెత్త తరలించకపోవడం, మురుగు కాల్వ నిర్మాణం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ ప్రాంతం అధ్వానంగా దర్శనమిస్తోంది. మురుగు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభించి రోగాలు ప్రబలుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న ఇళ్లల్లో పరిస్థితి దారుణంగా ఉంది.
- లక్ష్మీకాంత, స్థానికురాలు

### భరించలేని దుర్వాసన



చెత్త కుప్పలు కుప్పలుగా పడేస్తుండటంతో దుర్వాసన ఎక్కువవుతోంది. ఇటువైపు నుంచి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇళ్లకు సమీపంలోనే ఉండటంతో భరించలేకపోతున్నాం. దోమల బెడద, పందుల సంచారం ఎక్కువైంది. అంటువ్యాధులతో సమస్యలు తలెత్తకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
- రమణ, స్థానికులు

## ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

**అరవిందనగర్ (కడప):** నగరంలోని మృత్యుంజయకుంట శివాలయం పునర్నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బుధవారం శివాలయ ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం చేపడతామని, ప్రభుత్వం నుంచి కూడా చేయూతనందిస్తామని చెప్పారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


శివాలయ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

### శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించాలని వినతి

**కడప, చిన్నచౌకు:** కడప నగరంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ చేపట్టాలని బలిజ సంఘం నాయకుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డికి బుధవారం వినతి పత్రాలను అందజేశారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా విగ్రహాన్ని ఆవిష్కరించకుండా రాయలవారి ప్రజలు మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. రాజకీయ పలుకుబడితో ముసుగు తీసేసి పూలమాల వేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఆవిష్కరించాలని కోరారు.

### రహదారి నిర్మించాలని...

**అరవిందనగర్ (కడప):** నగరంలోని అశోక్‌నగర్‌లో రహదారి నిర్మించాలని కోరుతూ పలువురు మున్సిపల్ కడప ఎమ్మెల్యే మాధవికి వినతి పత్రం అందించారు. అశోక్‌నగర్ 36-634-1 డోర్ నంబర్ నుంచి సిమెంటు రహదారి నిర్మించాల్సి ఉండగా అప్పటి పాలకులు అలాగే వదిలేశారన్నారు.

## ఆయుధాలపై అవగాహన

**సిద్దవటం, న్యూస్‌టుడే :** ఆయుధాల సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డిఎస్పీ, వెల్ఫేర్ ఆఫీసర్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిద్దవటం మండలం భాకరాపేట శివారులోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో బుధవారం సాంకేతిక ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) నిర్వహించారు. బెటాలియన్ యూనిట్ ఉపప్రతి దివ్యరాణి, ఆర్ఐ, ఆర్ఎస్ఐలు, పీటర్ ఎస్సైలు, పాఠశాలల హెచ్ఎంలు నాగమునిరెడ్డి, లక్ష్మీశేషమ్మ, ఉపాధ్యాయులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలపై విచారణకు వినతి

**సిద్దవటం, న్యూస్‌టుడే :** గత వైకాపా ప్రభుత్వంలో సిద్దవటం మండలంలో జరిగిన స్థల, భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సిద్దవటం మండలం పాలెంపల్లె గ్రామానికి చెందిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పాల వెంకటసుబ్బయ్య కోరారు. ఏపీ సచివాలయంలో బుధవారం రెవెన్యూ మంత్రిని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు.

## ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు


విద్యార్థులతో కేకు కోయిస్తున్న అభిమానులు

**కడప చిన్నచౌకు:** సినీహీరో ప్రభాస్ జన్మదినం సందర్భంగా బుధవారం జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో నగరంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. అప్సర థియేటర్ సమీపంలోని వినాయక గుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులతో కేకు కట్ చేయించారు. అనంతరం అమ్మఒడిలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు మధురెడ్డి, పవన్‌రాజు, గిరి, నాగేంద్ర ప్రభాకర్‌నాయుడు తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో ఖలీద్‌సైపుల్లాకు పదవి

**కడప భాగ్యనగర్‌కాలనీ:** కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా డేటా అండ్ టెక్నాలజీ విభాగం వైస్ ఛైర్మన్‌గా తనను నియమించినట్లు ఖలీద్ సైపుల్లా తెలిపారు. తాను నగరంలోని మదీనా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివినట్లు పేర్కొన్నారు.

## కడప-బెంగళూరు రైల్వే లైనును పట్టించుకోరా?

**వేంపల్లె, న్యూస్‌టుడే :** కడప-బెంగళూరు నూతన రైలు మార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో బుధవారం మాట్లాడుతూ నాలుగు దశల్లో చేపట్టాల్సిన ఈ పనుల్లో కడప నుంచి పెండ్లిమర్రి వరకు పనులు చేపట్టి వదిలేశారన్నారు. దీనిని పూర్తి చేయాలన్నారు. అనంతరం వేంపల్లెలో ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి సుబ్బరాయుడు కుమారుడు ధనుష్‌కుమార్‌ను పరామర్శించారు. ధ్రువకుమార్ రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, వేమ రాజ పాల్గొన్నారు.

## వేంపల్లె అభివృద్ధికి జగన్ చేసింది శూన్యం

**వేంపల్లె, న్యూస్‌టుడే :** నియోజకవర్గంలో పెద్ద పట్టణంగా ఉన్న వేంపల్లె అభివృద్ధిపై మాజీ సీఎం జగన్ శ్రద్ధ పెట్టక పోవడంతో పూర్తిగా వెనుకబడిందని మండల తెదేపా కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడు పులివెందుల నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రగల్బాలు పలికిన జగన్ నిధుల మంజూరు విషయానికి వచ్చేసరికి మొండి చేయి చూపారని అన్నారు.

## పాఠశాల కరస్పాండెంట్‌ను చితకబాదిన తల్లిదండ్రులు

**పులివెందుల (వేంపల్లె) న్యూస్‌టుడే :** పులివెందుల పట్టణంలోని పార్నపల్లె మార్గంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌ను బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు చితకబాదారు. తమ కుమారుడిని కొట్టాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, వారి బంధువులను వెంట బెట్టుకుని పాఠశాల వద్దకు వచ్చారు. గట్టిగా కేకలు వేస్తూ కరస్పాండెంట్‌ను వెలుపలికి రమ్మని పిలిచి దాడి చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

## క్రమశిక్షణతో నడుచుకోవాలి

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే :** నేటితరం విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎస్.ఐ శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తమాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు.

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

**పెండ్లిమర్రి, న్యూస్‌టుడే :** ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోనాయపల్లెలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి హాజరైన ఆయన మినుము పంటను పరిశీలించారు. ఏవో జి.పెద్ద ఓబులేసు, ఏఈవో గంగాధర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెండ్లిమర్రి కషాయాల తయారీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

**కమలాపురం:** తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఏవో సరస్వతి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అవినీతి రహిత సమాజానికి పాటుపడాలి

**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే :** అవినీతి రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ హరివెంకటకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జె.కొత్తపల్లె బోడెద్దులపల్లె గ్రామాల్లోని పాఠశాలల్లో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పవర్‌గ్రిడ్ అధికారులు ప్రమోద్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**కమలాపురం, న్యూస్‌టుడే :** స్థానిక క్రాస్‌రోడ్డు వద్ద భారతి సిమెంట్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని పరిశ్రమ సీఎంవో సాయిరమేష్ బుధవారం ప్రారంభించారు. వైద్యశాలలో ఉచితంగా కంటి వైద్యం అందించడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు చేస్తామని చెప్పారు. పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, సీఎస్‌ఆర్ నితేశ్వర్, కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్కా బీటర్ల అరెస్టు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో నాగరాజుపేటలో సుబ్బరాయుడుతో పాటు నలుగురు వ్యక్తులు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసి, రూ.20,850 స్వాధీనపరచుకున్నట్లు ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ● కడప నగరంలోని మోచంపేట వద్ద మట్కా నిర్వహిస్తున్న షేక్ మహమ్మద్ ఖాసీంను అరెస్టు చేసి, రూ.14,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## కాలువలు అస్తవ్యస్తం... రహదారులు దారుణం

న్యూస్‌టుడే, కమలాపురం

కమలాపురం నగర పంచాయతీ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థ, గుంతల రహదారులతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. నగర పంచాయతీలో 20 వార్డుల్లో 24 వేల వరకు జనాభా ఉన్నారు. కొన్ని చోట్ల సీసీ రోడ్లు నిర్మించినా చాలా చోట్ల లేవు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి బాలికల ఉన్నత పాఠశాల వరకు, సొసైటీ కాలనీ, గిడ్డంగి వీధి నుంచి పుట్లంపల్లె, క్రాస్ రోడ్డు ఆర్చి నుంచి కమలాపురానికి వచ్చే మార్గంలో, మారుతీనగర్, గాంధీ నగర్, పడమర వీధిలో శివాలయం వరకు, అక్కంపేట-మీరాపురం, మాచిరెడ్డిపల్లె క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులు ఛిద్రం కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వీధుల్లో చాలా చోట్ల మురుగు కాలువలు ఎత్తుగా ఉండడంతో, వర్షం వచ్చిందంటే రోడ్లపై నీరు నిలిచిపోతున్నాయి. కాలువలను అనుసంధానం చేయకపోవడంతో పలుచోట్ల మురుగు పొంగిపొర్లి దుర్వాసన వస్తోంది. వ్యర్థాలు పేరుకుపోవడంతో విపరీతంగా దోమలు పెరిగి, నివాసితులు రోగాల బారిన పడుతున్నారు. గత వైకాపా పాలనలో 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచినా, బిల్లులు వస్తాయో లేదో అని గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.


కమలాపురం నుంచి క్రాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గుంతల్లో నిలిచిన నీరు


సూర్య పాఠశాలకు వెళ్లే మార్గంలో మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

### నిధులు రాగానే రహదారులు నిర్మిస్తాం

నగర పంచాయతీకి ప్రత్యేక నిధి కింద రూ.18 కోట్లు మంజూరయ్యాయి. వీటితో సీసీ రోడ్లు, అసంపూర్తి మురుగు కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యే పుత్తా పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు రాగానే సీసీ రోడ్లు దెబ్బతిన్నాయో అక్కడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. - జగన్నాథ్, నగర పంచాయతీ కమిషనర్, కమలాపురం

## ప్రతిభకు పదును


విజేతలతో ప్రిన్సిపల్ నాగభూషణం, అకడమిక్ డీన్ అశోక్

**కడప విద్య, న్యూస్‌టుడే :** కడప నగరం చిన్నచౌక్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. మొదటి, రెండు, మూడు స్థానాల్లో వి.సహస్రరెడ్డి (8వ తరగతి), కె.సుస్మిత (8వ తరగతి), ఎం.ముక్తజయ (9వ తరగతి) నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ నాగభూషణం, అకడమిక్ డీన్ అశోక్‌లు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## వైకాపా పాలనలో ఎంతమందికి న్యాయం చేశారు?

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** వైకాపా పాలనలో దిశ యాప్, పోలీస్‌స్టేషన్లు తీసుకువచ్చామని ప్రచారం చేస్తున్న నాయకులు ఎంతమందికి న్యాయం చేశారో చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ఎంతోమంది ముస్లిం మైనార్టీలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని ఆరోపించారు. బద్వేలులో ఉన్మాది చేతిలో హత్యకు గురైన బాలిక కుటుంబానికి చంద్రబాబు అండగా నిలిచి రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారని చెప్పారు. రూపనగుడిహుస్సేన్, బాబయ్య, అమీర్, ఖాదర్‌బాషా, సీమన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు వేంపల్లె విద్యార్థి


ఎంపికైన విద్యార్థితో కరస్పాండెంట్, పీడీ

**వేంపల్లె, న్యూస్‌టుడే :** జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ధర్మ ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఇటీవల సీకే దిన్నె మండలం బయనపల్లెలో నిర్వహించిన పోటీల్లో ఈ విద్యార్థి సత్తా చాటాడు. అతడిని పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, పీడీ కృష్ణప్రసాద్‌లు అభినందించారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

**చక్రాయపేట:** మండల పరిధిలోని ఆంజనేయపురంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటిఐ)లో 2024-25లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాధాకృష్ణయ్య పేర్కొన్నారు. అక్టోబర్ 26వ తేది లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## యథేచ్ఛగా భూకబ్జా


మాధవరం-1, 2, 3 వార్డుల గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

**సిద్దవటం, న్యూస్‌టుడే :** మండలంలోని మాధవరం-1, 2, 3 వార్డుల గ్రామంలో ఆక్రమణదారులు యథేచ్ఛగా భూ ఆక్రమణకు యత్నించారు. ఇక్కడి 459 సర్వే సంఖ్యలో ఖాళీగా ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇటీవల స్థానికుడు ఒకరు కంప చెట్లు తొలగించే పనులు చేపట్టారు. అలాగే 427 సర్వే సంఖ్యలో సుమారు 50 సెంట్ల ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా యంత్రాలతో చదును పనులు చేపట్టారు. రెవెన్యూ అధికారులు బుధవారం నిర్వహించిన సదస్సులో స్థానిక తెదేపా నాయకులు కొందరు గ్రామంలో కొనసాగుతున్న భూ ఆక్రమణలపై తహసీల్దారు మురాషావలికి ఫిర్యాదు చేశారు.

## గ్రంథాలయం సేవలు... వారంలో మూడు రోజులే

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** మండలంలోని కొత్త మాధవరంలో గ్రంథాలయం సేవలు పాఠకులకు వారంలో మూడు రోజులే అందుతున్నాయి. గతంలో దీనిని అద్దె భవనంలో నిర్వహించారు. రెండు నెలల కిందట ఖాళీగా ఉన్న పంచాయతీ భవనంలోకి మార్పు చేశారు. ఇక్కడ విధులు నిర్వర్తించడానికి జయప్రకాష్ అనే ఉద్యోగి నియమితులయ్యారు. ఆయన కొత్తమాధవరంలో మంగళ, బుధ, గురువారాల్లో పనిచేస్తున్నారు. పుల్లంపేట గ్రంథాలయం అదనపు బాధ్యతలు అప్పగించడంతో అక్కడికి శని, ఆది, సోమవారం వెళుతున్నారు. దీంతో పాఠకులకు నిరాశే మిగులుతోంది. ఈ విషయంపై జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి బాషామొద్దీన్‌ను సంప్రదించగా సిబ్బంది కొరత ఉండటంతో తాత్కాలికంగా సర్దుబాటు చేశామని తెలిపారు.



## అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వీసీ విజయకుమార్, డైరెక్టర్ గుప్తా

**వేంపల్లె, న్యూస్‌టుడే:** చెన్నై ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో, బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 16 మంది ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార్‌స్వామి గుప్తా తెలిపారు. వీరిని వర్సిటీ ఉపకులపతి విజయకుమార్, ఏఓ రవికుమార్, పీడీలు రమణారెడ్డి, బాల ఓబయ్య, షంషాద్ బేగం అభినందించారు.

## విద్యార్థులకు తీరని దాహార్తి


ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేయని నీటి శుద్ధి కేంద్రం

న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

గత వైకాపా ప్రభుత్వంలో పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు ఉపయోగం లేకుండా పోయాయనడానికి మాధవరం పాఠశాలలోని ఆర్వోకేంద్రం నిదర్శనంగా నిలుస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రం కొన్నాళ్లకే మూతపడింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తమాధవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బాల, బాలికలు 343 మంది విద్యనభ్యసిస్తున్నారు. గత వైకాపా పాలనలో మన బడి 'నాడు-నేడు' మొదటి దశలో తాగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడానికి రూ.6,68,418 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. యంత్ర పరికరాలు, సామగ్రి తెప్పించి అమర్చారు. ఇందుకోసం రూ.5.46 లక్షలు వెచ్చించారు. కొన్నాళ్లు పాటు పనిచేసింది. సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో ఆగిపోయింది. దీనిని బాగు చేయాలని ఉపాధ్యాయులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సరఫరా సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు. విద్యార్థులు దాహార్తి తీర్చడానికి హెచ్‌ఎం, గురువులు కలిసి ప్రతిరోజూ 10-12 డబ్బాలు (క్యాన్లు) కొంటున్నారు. ఇందుకోసం రూ.150-180 ఖర్చు అవుతోంది. కొన్ని నెలలుగా వీరు సొంత డబ్బులు వెచ్చిస్తున్నారు. పలువురు విద్యార్థులు ఇంటి నుంచి సీసాల్లో తెచ్చుకొని తాగుతున్నారు. 'నాడు-నేడు'లో మౌలిక వసతుల కల్పనకు రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు దృష్టిసారించి ఆర్వోప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సీసాల్లో నీటిని తెచ్చుకొని మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థినులు